క్లుప్తంగా

డబుల్‌బెడ్ రూం ఇళ్లను త్వరలో పూర్తిచేస్తాం


డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ కరుణాకర్‌రెడ్డి

ఏన్కూరు: అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను త్వరలో పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ డీఈ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తిమ్మారావుపేటలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి నిధుల అంచన వేసి కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. తాగునీరు, డ్రైయినేజీ, విద్యుత్ రోడ్ల నిర్మాణానికి కూడా ఆయా శాఖల అధికారుల నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ అనుషా పాల్గొన్నారు.

కేజీ సిరిపురం వాసికి డాక్టరేట్


బలరాం కృష్ణ

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి బలరాం కృష్ణకు ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అందజేశారు. మంజుకపూర్, అనితా నాయక్ రచించిన నవలల స్త్రీ పాత్రల అధ్యయనంపై బలరాం కృష్ణ పరిశోధన చేసిన డాక్టరేట్ సాధించారు. మారుమూల గ్రామమైన కేజీ సిరిపురం నుండి విద్యాభ్యాసం ప్రారంభించి డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఖోఖోలో ఎంపికైన సాయిచరణ్


కబడ్డీలో ఎంపికైన యశ్వంత్

కల్లూరు: కల్లూరు మండల స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో ఖోఖో బాలుర విభాగంలో తెలంగాణ గ్రామర్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి సాయిచరణ్ జిల్లా స్థాయిలో ఆడడానికి ఎంపికయ్యాడు. అదే విధంగా కబడ్డీలో 10వ తరగతి చదువుతున్న గోపి, సీనియర్ విభాగంలో యశ్వంత్‌లు ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను టీజీఎస్ చైర్మన్ ఎస్‌కే జానిమియ, వైస్ చైర్మన్ పసుమర్తి చందర్‌రావు, కేశవరావు, రంజిత్‌రెడ్డి, హెచ్‌ఎం ఇందిరలు విద్యార్థులను అభినందించారు.

పరుగు పందెంలో ప్రతిభ చూపిన హనీ


ప్రశంసా పత్రం అందుకుంటున్న హనీ

మధిర: ఖమ్మంలో జరుగుతున్న జిల్లాస్థాయి పాఠశాలల క్రీడల్లో 800 మీటర్ల పరుగు పందెంలో మధిర పట్టణానికి చెందిన హనీ అను విద్యార్థిని జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని హనీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిటౌన్: దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నిత్యావసర ధరలను అదుపు చేయటంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ విమర్శించారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన బీకేఎంయూ డివిజన్ స్థాయి సమావేశంలో అయన మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంటనూనె, పప్పుల ధరలు పెంచటంతో మూలిగే నక్కపై తాటికాయపడిన చందంగా మారిందన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు రామలక్ష్మి, రంజాన్‌బీ, అంజమ్మ, సుజాత, అప్పారావు, చెన్నారావు, సాయిబాబా, దుర్గారావు, సీత, సత్యం పాల్గొన్నారు.

పరిహారమే పరిష్కారమా..?

వైద్యం వికటించి పోతున్న ప్రాణాలు

- వైద్యుల నిర్లక్ష్యం అంటున్న బాధితులు..
- అవగాహన లోపమంటున్న వైద్యులు


ఆందోళన కారులను సముదాయిస్తున్న పట్టణ సీఐ టి.కిరణ్ (ఫైల్)

సత్తుపల్లి: 'వైద్యో నారాయణ హరి..' అనే నానుడికి ప్రైవేట్ ఆస్పత్రుల పనితీరుకి భిన్నంగా ఉంది. సత్తుపల్లి పట్టణంలో వైద్యం వికటించి ఇటీవల ఇద్దరు మృత్యువాతపడటం వైద్యుల పనితీరు చర్చనీయాంశమైంది. రోగులు హెల్త్ ప్రొఫైల్‌ను దాచిపెట్టడంతో రోగిపై సరైన అవగాహన లేకపోవటం వల్లే వైద్యం అందక మృత్యువాతపడుతున్నారని ఇటీవల జరిగిన రెండు ఘటనలతో బలం చేకూర్చుతోంది.

హెల్త్ ప్రొఫైల్ తెలియకే..

ఆగస్టు నెలలో సత్తుపల్లి మండలం రేగళ్లపాడుకు చెందిన విద్యార్థి తబుస్సుమ్ విపరీతమైన జ్వరంతో సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించి మరణించింది. అయితే స్థానిక ఆర్‌ఎంపీ వైద్యం చికిత్స చేసి చివరి నిమిషంలో సత్తుపల్లికి తీసుకొచ్చినట్టు తెలిసింది.

అదేవిధంగా దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన గర్భిణి శ్రావణి డెలివరీ కోసం తనకు వైద్యం చేసే డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో వేరే ఆస్పత్రిలో చేర్పించారు. ప్పటికే ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆపరేషన్ చేయగా బిడ్డకు జన్మనిచ్చింది. కానీ శ్రావణికి బీపీ లెవల్ హెచ్చుతగ్గులతో తీవ్ర రక్తస్రావం కావటంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో హైద్రాబాద్ తరలిస్తుండగా మృతి చెందింది. అయితే ఈ రెండు సంఘటనలలో పేషెంట్ హెల్త్ ప్రొఫైల్‌పై వైద్యం చేసిన డాక్టర్లకు సరిగ్గా అవగాహన లేకపోవటం వల్లే మృత్యువాతపడినట్లు విమర్శలు వస్తున్నాయి.

పరిహారంతో సరిపెట్టుకుంటున్న వైనం..

వైద్యం వికటించి చనిపోయారంటూ మృతులు బంధువులు ఆస్పత్రుల వద్ద ఆందోళనకు దిగటం రెండు నెలల్లో ఇది రెండో సారి. విద్యార్థి మృతి కేసులో బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేయటంతో బాధిత కుటుంబానికి పరిహారం కింద రూ.5 లక్షలు చెల్లించినట్లు సమాచారం. అదే విధంగా శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో పెద్ద ఎత్తున ఆందోళన జరగటంతో ఇటు వైద్యులు, అటు మృతురాలి బంధువులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయటంతో ఇక్కడ కూడా రూ.5 లక్షల పరిహారం చెల్లించేందుకు పెద్ద మనుషుల పంచాయతీ జరిగినట్లు ప్రచారం.

కనిపించని పరిష్కార మార్గాలు..

ఆస్పత్రుల్లో రోగులు మృత్యువాతపడటం.. పరిహారం చెల్లించటంతోనే సమస్య పరిష్కారమైనట్టు భావించాల్సిందేనా దీనికి అసలైన చికిత్స ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైద్య చికిత్సలో తప్పులు జరిగితే ఎవరిని బాధ్యులను చేయాలి.? రోగుల బంధువులు ఆందోళనలు చేయటం సరైన పద్ధతేనా అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఇలా అయితే అత్యవసర వైద్యం చేయాలంటే ఏ డాక్టర్ ముందుకు వచ్చే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వైద్యుల నుంచి వ్యక్తమవుతుంది. రోగిని ఆస్పత్రికి చేర్చగానే ఏం జరిగినా మాకు సంబంధం లేదంటూ ముందుగానే డిక్లరేషన్ తీసుకోవాలని, ఆస్పత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలనే డాక్టర్ల నుంచి విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. మరోవైపు రోగులను ఇబ్బంది పెట్టకుండా సరైన చికిత్స అందించలేని పరిస్థితి ఉంటే సరైన సమయంలోనే మెరుగైన వైద్య సేవలకు రిఫర్ చేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడతారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వైద్య ఆరోగ్యశాఖ ఆస్పత్రుల నిర్వహణ, వైద్యుల పనితీరుపై ఆకస్మిక తనిఖీలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తుంది.

ఉత్కంఠభరితంగా లారీ యూనియన్ ఎన్నికలు


అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావు


విజయం సాధించిన రావి నాగేశ్వరరావు ప్యానల్

సత్తుపల్లి: సత్తుపల్లి లారీ, టిప్పర్ యజమానుల సంఘం ఎన్నికలు ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగాయి. 411 ఓట్లకు గాను 389 ఓట్లు పోల్ అయ్యాయి. అధ్యక్షుడిగా రావి నాగేశ్వరరావు(కుర్చీ గుర్తు)238 ఓట్లు, ప్రత్యర్థి ఎస్‌కె దావూద్‌కు(గోడగడియారం గుర్తు) 148 ఓట్లు, ఉపాధ్యక్షునిగా ఎస్‌కె ఖలీల్ 235 ఓట్లు, పి.కోటేశ్వరరెడ్డి 150 ఓట్లు, కార్యదర్శిగా కొండపల్లి రమేష్‌రెడ్డికి 217 ఓట్లు, పీఎల్ ప్రసాద్ 168 ఓట్లు, జాయింట్ సెక్రటరీగా పాలకుర్తి దాసుకు 223 ఓట్లు, మోరంపూడి బాలకృష్ణకు 160 ఓట్లు, కోశాధికారిగా ఎస్‌కె మౌలాలీకి 212 ఓట్లు, ఎస్.విజయ్‌కుమార్‌కు 166 ఓట్లు లభించాయి. రావి నాగేశ్వరరావు ప్యానల్‌లోని ఐదుగురు అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా ఎస్‌కె అబ్దుల్‌పాషా, ఎండి ముకరం హుస్సేన్, పబ్బిరెడ్డి రమేష్‌లు వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఎన్నికలపై ఉత్కంఠ..

లారీ యజమానుల యూనియన్ ఎన్నికలు ఈ సారి సాధారణ ఎన్నికల్లా ఉత్కంఠత రేకెత్తించాయి. వారంరోజుల నుంచి సత్తుపల్లి పట్టణంలో ఇంటింటి ప్రచారంతో రావి నాగేశ్వరరావు ప్యానల్(కుర్చీగుర్తు), ఎస్‌కె దావూద్ ప్యానల్(గోడగడియారం) హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. రావి నాగేశ్వరరావు ప్యానల్ ఘన విజయం సాధించటంతో పట్టణంలో లారీ యజమానులు ప్రదర్శన నిర్వహించి బాణసంచా కాల్చారు.

కోటమైసమ్మ జాతర ఆహ్వాన పత్రిక విడుదల


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

కారేపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మతల్లి జాతర సందర్భంగా నిర్వహణ కమిటీ ఆహ్వాన పత్రికను ఆదివారం విడుదల చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించే జాతర వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని, అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవాలతో పాటు దసరా పర్వదినాన ప్రారంభమయ్యే జాతరకు వేలాది భక్తజనం రానున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణ అధికారి వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్ట్ చైర్మన్ పట్టాభిరామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాసశర్మ, సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా సాయి, మూడ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా జిల్లా అధ్యక్షుడిగా రామ్‌కిషోర్



రామ్‌కిషోర్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్

కారేపల్లి: ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన భూక్యా రామ్‌కిషోర్‌ను ఆదివారం నియమించారు. దీనికి సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాజునాయక్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రామ్‌కిషోర్ మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతానని, బంజారుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

జలవనరుల శాఖ ఏఈఈగా కృష్ణతేజ


కృష్ణతేజ

బోనకల్: మండల కేంద్రానికి చెందిన చల్లా కృష్ణతేజ జలవనరుల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జలవనరుల శాఖ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. జలవనరుల శాఖలో ఉద్యోగం సాధించిన కృష్ణతేజను పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్, మాజీ జెడ్పీటీసీలు బానోత్ కొండా, మోదుగు సుధీర్ బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు గుగులోత్ పంతులు తదితరులు అభినందించారు.

కొండయ్య సేవలు అభినందనీయం


మహాత్మాగాంధీ కేంద్రానికి పాత దుస్తులను అందజేస్తున్న వ్యక్తులు

మధిర: లంకా సేవా ఫౌండేషన్ పేరుతో కొండయ్య చేస్తున్న సేవలు అభినందనీయమని సంక్షేమాధికారి ఈలప్రోలు శ్రీనివాసరావు తెలిపారు. మధిరలో లంకా కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాతబట్టల కేంద్రానికి ఆదివారం పలువురు పాత దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబట్టలను సేకరించి వాటిని శుభ్రపరిచి నిరుపేదలకు అందించటం ఎంతో వ్యయప్రయాలతో కూడుకున్నదని తెలిపారు. పాతబట్టలను చలువాది శ్రీనివాసరావు, కందుకూరు వెంకటేశ్వరరావు, గుర్రం రాము, ముత్తినేని గోపాలరావు, ములకపల్లి రాధాకృష్ణ, చలువాది నాగభూషణం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు రాంబాబు, యోహోను, సంధ్య, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలకు ఐరన్ టేబుల్ బహూకరణ


ఐరన్ టేబుల్ బహూకరిస్తున్న లయన్స్ సభ్యులు

వైరా: వైరాలోని పుతుంబాక ఇంద్రాణి వేద పాఠశాలకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఐరన్ టేబుల్ బహూకరించారు. ఆ తర్వాత వేదపాఠశాలలోని ఆచార్య దంపతులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు గడియారం బహూకరించి ఘనంగా సత్కారించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు రమేష్, నాగేశ్వరరావు, సీత, హనుమాయమ్మ, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు గ్రామానికి చెందిన వెల్లంకి మణి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఇటీవల ఈమె ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. కాగా ఆదివారం ఈమెను నవతరం కమిటీ సభ్యులు ఇంటి వద్దనే పరామర్శించి.. రూ.22వేల నగదు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో నవతరం గౌరవ అధ్యక్షుడు దోమందుల సామేలు, మండల కమిటీ అధ్యక్షులు కోటా లోకేశ్వరరావు, కార్యదర్శి రమేష్, సభ్యులు ప్రభాకర్, రత్నాకర్, క్రిస్టోఫర్, సురేష్ తదితరులున్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో ఆదివారం రగ్బీ శిక్షణ శిబిరాన్ని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ - జూనియర్, సీనియర్ బాలబాలికలకు నిర్వహించే రగ్బీ శిక్షణకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వాగదాని కన్నయ్య, ఎండీ అజ్గర్, కేజీబీవీ ఇందిర, శేషగిరి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

సత్తుపల్లి: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమరెడ్డి ఆకస్మిక మరణం పట్ల సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు ఆదివారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పురుషోత్తమరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

రోశమ్మకు పువ్వాళ్ల దుర్గాప్రసాద్..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన గోవింద్ రోశమ్మ చిత్ర పటానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఆదివారం పూల మాల వేసి నివాళులర్పించారు. రోశమ్మ కుమారుడు తల్లాడ సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనును పరామర్శించారు. రోశమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చింతకాని: మండలంలోని చిన్నమండవ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రంగాల్లో స్థిరపడిన వారందరూ 19 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి ఆటపాటలతో సందడి చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన విద్యార్థి గుండ్ల అశోక్ గతేడాది మృతి చెందటంతో అతని కుటుంబానికి రూ.25 వేల నగదును పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుపాకుల ఉపేందర్, మొర్ల మాధవ్, గుండ్ల శేఖర్, శ్యామకూరి ఉపేందర్, నరేష్, పర్చగాని ఉమారాణి, తంగిరాల ఉషారాణి, హైమారాణి, లక్ష్మీ, అశ్విని పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు


మాట్లాడుతున్న సరళ

బోనకల్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై రోజురోజుకు దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ విమర్శించారు. ఆదివారం మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ పాలన వచ్చిన తర్వాత మహిళలకు భద్రత, గౌరవం లేకుండా పోయిందన్నారు. మహిళా చట్టాలను పాలకులు సమర్థవంతంగా అమలు చేయకపోవటం వలనే మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. అనంతరం ఐద్వా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా జొన్నలగడ్డ సునీత, అధ్యక్షురాలిగా కేతినేని ఇందు, ఉపాధ్యక్షురాలిగా పిల్లలమర్రి జాన్సీ, సహాయ కార్యదర్శిగా తెల్లాకుల రజిని ఎన్నికయ్యారు. ఈ సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి, రాష్ట్ర కమిటీ సభ్యులు పయ్యావుల ప్రభావతి, ముదిగొండ మండల కార్యదర్శి కోలేటి అరుణ, నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక..


ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా సుజాత, కృష్ణవేణి

వైరా: అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం వైరా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా మాడపాటి సుజాత, తోట కృష్ణవేణిలు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఇరువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వితంత, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా కమిటీ సూచనల మేరకు పని చేస్తామని వివరించారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం


వైరా: మాట్లాడుతున్న బొంతు రాంబాబు


తల్లాడ: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా/వైరారూరల్/బోనకల్/చింతకాని/తల్లాడ: ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, చింతలచెర్వు కోటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లిలో, వైరా లింగన్నపాలెంలో నిర్వహిస్తున్న సీపీఎం గ్రామశాఖ మహాసభల్లో రాంబాబు పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మోడల్ కాలనీల నిర్మాణం చేపట్టాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. బోనకల్ మండలంలోని మోటమర్రిలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ మహాసభలో కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పిక్కెల సీతారాములు ఎన్నికయ్యారు. చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామంలో, తల్లాడ మండలంలోని రెడ్డిగూడెంలో నిర్వహించిన గ్రామశాఖ సభల్లో సీపీఎం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్ పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకునే విధంగా కార్యకర్తలు శ్రమించాలన్నారు. పాతర్లపాడు సభలో గ్రామ శాఖ నూతన కార్యదర్శులుగా అప్పారావు, కొండలరావు ఎన్నికయ్యారు. ఈ సభలో సీపీఎం నాయకులు కేతినేని నాగేశ్వరరావు, చిట్టిమోదు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, బాజోజు రమణ, షేక్. జానిమియా, తోటకూర బాబురావు, సజ్జ నాగేశ్వరరావు, దిరిశాల రామకృష్ణ, బాణాల నాగబ్రహ్మాచారీ, సామినేని రామారావు, మడుపల్లి గోపాలరావు, జానికీరాములు, వెంకటనర్సయ్య, రవి, సుంకర సుధాకర్, కొంగల సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, చిట్యోజ్ నాగేశ్వరరావు, చావా కళావతి, గుత్తా వాసు తదితరులు పాల్గొన్నారు.

పల్లెను పట్టించుకునే నాథుడేడి?


డంపింగ్ యార్డును తలపిస్తున్న మర్లపాడు శివారు

- చెత్తకుప్పలకు నిలయంగా గ్రామ శివారులు
- మురుగు నీటి మయంగా డ్రెయినేజీలు
- పట్టించుకోని ప్రత్యేకాధిరులు
- ఇబ్బంది పడుతున్న పల్లెప్రజలు

వేంసూరు: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తరువాత ప్రత్యేకాధికారుల పాలనతో పల్లె ప్రజల కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పల్లెప్రజలు వాపోతున్నారు. వేంసూరు మండలంలోని 26 గ్రామ పంచాయితీలో పల్లె ప్రజల కష్టాలను అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామాల్లో అంతర్గ రహదారుల వెంట ఉన్న డ్రెయినేజీల్లో నిల్వ ఉన్న మురుగు విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న వారే కరువయ్యారు ప్రజలు వాపోతున్నారు. ట్రాక్టర్లద్వారా చెత్తసేకరణ చేపట్టకపోవడంతో వీధుల్లో ఏర్పాటు చేసిన చెత్త కుండీలు మురుగు వాసన వస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలి కోరారు.

అందుబాటులో ఉండని కార్యదర్శులు..

పంచాయతీల్లో కార్యదర్శులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కార్యదర్శులు.. పత్తా లేకుండా పోతున్నారని తెలిపారు. అడిగితే ఎంపీడీఓ ఆఫీస్‌లో మీటింగ్‌లో ఉన్నానని సమాధానమిస్తున్నారని ప్రజలు తెలిపారు.

చెత్త కుప్పలుగా గ్రామ శివారులు..

పల్లెల్లో పరిశుభ్రతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం డయాంగ్ యార్డులు, తడిపోడి చెత్తను వేరు చేసే విధంగా షెడ్లను నిర్మించిన ప్రత్యేకాధికరుల పాలనలో నిరుపయోగంగా మారియి. చెత్త సేకరణపై కార్యదర్శులు శ్రద్ధ చూపకపోవడంతో గ్రామ శివారులు చెత్త కుప్పలతో దర్శనం ఇస్తున్నాయి.

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..



గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం ఈ నెల 17నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించడంలేదని పలు గ్రామాల ప్రజలు మా దృష్టికి తీసుకోస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– బాస్కర్ల వీరంరాజు,
బీజేపీ నియోజకవర్గ కన్వీనర్